యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పి విక్రాంత్ పాటిల్, జెసి నవ్య, అధికారులు

కౌలుకు సాయమందేనా..?

కొత్త చట్టం చేయడంలో సర్కార్ జాప్యం

ఎన్నికల్లో ఇచ్చిన హామీ గాలికి..

నష్టపోతున్న కౌలు రైతులు

తాము అధికారంలోకి వస్తే కౌలు చట్టంలో మార్పులు చేస్తామని ఎన్నికల ముందు కూటమి సర్కార్ హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి పది నెలలు పూర్తయినా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. కౌలు చట్టం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. దీంతో కౌలు రైతులు నష్టపోతున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఎన్నికల ముందు కొత్త కౌలు చట్టం చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ హామీపై మౌనం వహిస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో లక్ష మంది వరకూ కౌలు రైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వీరే చేస్తున్నారు. అందరికీ అన్నంపెట్టే కౌలురైతులకు మాత్రం ప్రభుత్వాలు న్యాయం చేయడం లేదు. సాగు చేస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వ సాయం అందకుండా చేస్తున్న పరిస్థితి నెలకొంది. అందుకు కారణం కౌలుచట్టంలో ఉన్న లొసుగులే కారణమని చెప్పొచ్చు. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ అధీకత సాగుదారుని' చట్టం పేరుతో కౌలురైతులకు ప్రత్యేక చట్టం తెచ్చింది. ఈ చట్టం కౌలురైతులకు కొంతమేర ఉపయోగపడినా పూర్తిస్థాయిలో న్యాయం జరగని పరిస్థితి నెలకొంది. ఈ చట్టంలో భూ యజమానితో సంబంధం లేకుండా కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసేవిధంగా నిబంధనలు తెచ్చారు. దీంతో కౌలుకార్డుల ఇవ్వకపోతే కౌలురైతులు, రైతుసంఘాల నాయకులు రెవెన్యూ అధికారులను నిలదీసేవారు. దీంతో కౌలుకార్డులు సాగుదారులకు అందేందుకు కొంత దోహదపడింది. కౌలుకార్డులు అందుకున్న రైతులకు పంటరుణాలు ఇవ్వాలంటూ బ్యాంకుల వద్ద ఆందోళన చేసి కొంతమేర సాధించుకునేవారు. కౌలురైతులకు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే విధంగా కౌలుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతులు, రైతుల సంఘాల నుంచి పెద్దఎత్తున డిమాండ్ ఉండేది.

వైసిపి చేసిన చట్టంతో ఉరి

2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కౌలుచట్టంలో మార్పులు చేస్తున్నట్లు చెప్పింది. దీంతో కౌలురైతులకు న్యాయం జరుగుతుందని అంతా భావించారు. వైసిపి 2019లో చేసిన 'ఆంధ్రప్రదేశ్ పంట సాగుదారుని హక్కుచట్టం' కౌలురైతులకు ఉరితాడుగా మారింది. భూయజమాని అంగీకారంతోనే కౌలురైతులకు కౌలుకార్డులు ఇవ్వాలంటూ కొత్తచట్టంలో మార్పులు చేసింది. దీంతో కౌలురైతులకు కౌలుకార్డులు అందని ద్రాక్షగా మారాయి. దీంతో అధికారులు కౌలురైతుల సంఖ్యను తక్కువగా చూపిస్తూ ఏమార్చేందుకు ప్రయత్నాలు చేయడం ప్రారంభించాయి. ఈ చట్టంతో కౌలుకార్డులు అందకపోవడం, బీమా, పంట నష్టపరిహారం వంటి ఏఒక్క ప్రభుత్వ సాయమూ కౌలురైతులకు అందకుండా పోయింది. చివరికి తాను పండించిన పంటను సైతం కౌలురైతులు తన పేరున అమ్ముకునేందుకు వీల్లేకుండా వైసిపి చేసిన చట్టం తయారైంది. దీంతో కష్టాల ఊబిలో కూరుకుపోవడంతో కౌలురైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయి. కొత్త కౌలుచట్టంపై తొలుత హడావుడీ..తర్వాత మౌనంతాము అధికారంలోకి వస్తే కొత్త కౌలుచట్టం తీసుకొచ్చి కౌలురైతులకు న్యాయం చేస్తామని టిడిపి కూటమి చెప్పింది. అధికారంలోకి వచ్చిన వెంటనే కౌలుచట్టం ముసాయిదా తయారు చేసేందుకు అభిప్రాయ సేకరణ పేరుతో జిల్లాల వారీగా కొన్నిచోట్ల సమావేశాలు నిర్వహించింది. శీతాకాల సమావేశాల్లో కొత్త కౌలుచట్టం చేస్తామంటూ హడావుడీ చేసింది. జిల్లాలో సమావేశం ఏర్పాటుకు సంబంధించి రెండు సార్లు తేదీలు ప్రకటించి రద్దు చేసింది. ఆ తర్వాత కౌలుచట్టం ఊసే లేకుండా పోయింది. శీతాకాల సమావేశాలు, బడ్జెట్ సమావేశాలు కూడా ముగిసిపోయాయి. భూ యజమానుల ఒత్తిడి మేరకు కొత్త కౌలుచట్టంపై ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త కౌలుచట్టం చేసి వచ్చే ఖరీఫ్ నుంచి కౌలురైతులకు ప్రభుత్వం అందించే అన్ని పథకాల అందేవిధంగా చేస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. కొత్త కౌలుచట్టం చేస్తే లబ్ధిపొందే వారిలో జిల్లాలోని రైతులే ఎక్కువగా ఉంటారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎంఎల్ఎలు సైతం కౌలుచట్టం గురించి మాట్లాడకపోవడం ఆశ్చర్యంగా ఉంది. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటుందో లేదో చూడాల్సి ఉంది.

కొత్త కౌలు చట్టం తీసుకురావాలి

కౌలుదారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి అన్ని ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని చెప్పి యజమానుల సంతకం ఉన్న వారికే గుర్తింపుకార్డులు ఇచ్చారు. అలా గత ప్రభుత్వం కౌలుదారులందరికీ అన్యాయం చేసింది. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు కొత్త కౌలు చట్టం తీసుకొస్తామని, పక్క భూమి వాళ్ల చెబితే చాలు గుర్తింపు కార్డులు ఇస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ కొత్త కౌలు చట్టం తీసుకురాలేదు. పంటలు పండక, పెట్టుబడి కూడా రాక కౌలుదారులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. ప్రభుత్వం కౌలు రైతుల పట్ల ముసలి కన్నీరు కారుస్తోంది తప్ప ఏమీ చేయడం లేదు. గత ప్రభుత్వం లాగేయ ఈ ప్రభుత్వం కూడా వ్యవహరిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొత్త కౌలు చట్టం తీసుకురావాలి. కౌలు రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

యోగా జీవితంలో భాగమవ్వాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

- జూన్ 21 వరకు జిల్లాలో యోగాంధ్ర ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు

- ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర కర్టెన్‌రైజర్ కార్యక్రమం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని ఇండోర్ స్టేడియంలో యోగాంధ్ర క్యాంపెయిన్‌కు శ్రీకారం చుడుతూ జరిగిన కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. యోగా శిక్షకులు యోగాసనాలు అభ్యాసం చేయించగా, జిల్లా కలెక్టర్, నగర మేయర్, ఎస్పీ, ఇతర అధికారులు, ప్రజలు యోగాసనాలు వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ యోగా వల్ల ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలపై నేటి నుంచి నెలరోజులపాటు విస్తతంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు. ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. జూన్ 21న వైజాగ్‌లో 5 లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పాల్గొంటున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు కోట్ల మంది యోగా ప్రయోజనాలు పొందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ నెల 27 వరకు మాస్టర్ ట్రైనర్లను గుర్తించి వారికి ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ నెల 28 నుండి జూన్ 3 వరకు మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ, జూన్ 4 నుండి 16 వరకు గ్రామ/వార్డు స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ నెల 27న మాస్ ర్యాలీ, 28న మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలతో ఈవెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 2న రంగోలి పోటీలు, జూన్ 18, 19 తేదీల్లో పాఠశాలల్లో, కళాశాలలో, యూనివర్సిటీలలో యోగాకు సంబంధించిన పాటల పోటీలు, పెయింటింగ్ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర మేయర్ బివై.రామయ్య మాట్లాడుతూ ఆరోగ్య భారతదేశం ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రధానమంత్రి యోగా దినోత్సవం కార్యక్రమం నిర్వహించడం సంతోషదాయకమన్నారు. పాఠశాలల్లో కూడా యోగా క్లాస్‌ను ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య మాట్లాడుతూ ఈ నెల 21 నుండి జూన్ 21వ తేదీ వరకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాల షెడ్యూల్‌ను ప్రకటించారు. అనంతరం యోగాసనాల కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. అంతకుముందు యోగాంధ్ర క్యాంపెయిన్‌లో భాగంగా నగరంలోని టౌన్ మోడల్ హైస్కూల్‌లో యోగా ఉత్సవాల బెలూన్‌ను కలెక్టర్, ఎస్పీ, జెసి ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, నగర మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఆర్‌ఓ వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, డిఎంహెచ్‌ఓ శాంతికళ, ఆయుష్ శాఖ డాక్టర్ ప్రసాద్, యోగా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అవినాష్, యోగా శిక్షకులు మునిస్వామి, విజయ్ కుమార్, ముంతాజ్ బేగం, గౌరీ, జిల్లా అధికారులు, అభ్యాసకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగభద్రకు నీటి ప్రవాహం

- 9,378 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో - నీటి నిల్వ 10 టిఎంసిలు

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర నదికి నీటి ప్రవాహం మొదలైంది. ఎగువన కర్నాటక రాష్ట్రంలో గతవారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర డ్యామ్‌కు నీటి ప్రవాహం వస్తోంది. బుధవారం తుంగభద్ర డ్యామ్‌కు 9,378 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 10 టిఎంసిల నీటి నిల్వ ఉంది. తుంగభద్ర డ్యామ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 105.788 టిఎంసిలు. ఆవిరి రూపంలో 2 వేల క్యూసెక్కుల నీరు తగ్గుతున్నట్లు తెలిసింది. గతేడాది మేలో 3 టిఎంసిలు నీరు మాత్రమే నిల్వ ఉండేది. గత పదేళ్ల క్రితం కూడా మేలో 5 టిఎంసిలు మాత్రమే నిల్వ ఉండేదని తుంగభద్ర బోర్డు సెక్షన్ అధికారులు పేర్కొంటున్నారు. ఈసారి ముందుగానే తుఫాను రూపంలో వర్షాలు కురవడంతో తుంగభద్ర డ్యామ్‌కు నీరు చేరడం శుభపరిణామమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మరమ్మతు పనులు ప్రారంభమయ్యేనా..?

తుంగభద్ర డ్యామ్‌కు 33 గేట్లు ఉన్నాయి. గతేడాది డ్యామ్ నీటి సామర్థ్యానికి మించి వరదలు రావడంతో 19వ గేట్ కొట్టుకుపోవడంతో ఆంధ్ర, కర్ణాటక రైతులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. నీటిపారుదల రంగ నిపుణులు కన్నయ్య నాయుడు సహకారంతో గేటుకు మరమ్మతులు చేపట్టారు. 33 గేట్లకు కాలం చెల్లినట్లు ఆయన నిర్ధారించారు. 33 గేట్ల నిర్మాణం కోసం రూ.41 కోట్లతో తుంగభద్ర బోర్డ్ అధికారులు టెండర్ పిలిచారు. హార్డ్‌వేర్ అండ్ టూల్ కంపెనీ గుజరాత్ వారికి దక్కింది. డిజైనింగ్ అప్రూవల్ అయింది. డిడబ్ల్యుసి పంపినట్లు బోర్డు అధికారులు తెలిపారు. పనులకు సంబంధించిన మెటీరియల్ కూడా సిద్ధం చేసుకోవాలని సదరు కంపెనీకి సూచించినట్లు తెలిసింది. వర్షాలు కురుస్తుండడంతో పనులు ప్రారంభిస్తారా, వాయిదా వేస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది.

తుంగభద్ర జలాశయం

వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

- భవిష్యత్ కర్తవ్యాల విజయవంతం కోసం కృషి చేస్తాం

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ నల్ల చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు సేవ్ వక్ఫ్, సేవ్ కాన్సిటెన్సీ జిల్లా జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కర్నూల్ నగరంలోని ఏ-క్యాంప్‌లో ఉన్న ఎంఎంఐ షాదిఖానలో సయ్యద్ మౌలానా జాకీర్ రసాధి అధ్యక్షతన బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ రఫిక్ అహ్మద్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ఆనంద్ బాబు, న్యాయవాది సుబ్బయ్య, ఆవాజ్ కమిటీ కార్యదర్శి ఎస్ఎండి.షరీఫ్, స్టేట్ మైనార్టీ సెల్ షేక్ ఆఫీస్ ఇలియాజ్, సమాచార హక్కు ఐక్యవేదిక నాయకులు జయన్న, ఎమ్మార్పిఎస్ నాయకులు కిరణ్, బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సయ్యద్ ఖుద్రతుల్లా ఖాద్రీ, కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఇన్చార్జ్ అమానుల్లా, జమాతే ఇస్లామియా ఏ హింద్ జిల్లా నాయకులు మునీర్ బాయ్, ఏపీ సి ఎల్ సి నాయకులు అల్లబకాష్, మైనారిటీ నాయకులు జావేద్ పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ఐక్యంగా ఈనెల 25న మానవహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, 27న మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ఎస్టీబీసీ కళాశాలలో భారీ బహిరంగ సభల ద్వారా ప్రజల్లో మరింత చైతన్యాన్ని తీసుకుని వస్తామన్నారు. జూన్ 3న మహిళల సమావేశం ఉంటుందని, వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా జరిగే ఈ ఉద్యమాల్లో ప్రజలు, ప్రజాతంత్ర వాదులు, అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మౌలానా తౌషీఫ్ రషది, ఎంఏ.హమీద్, మొహమ్మద్ బాషా, జహంగీర్, అబ్దుల్ రహమాన్, ఖాజా పాషా, మహబూబ్ వలి, అడ్వకేట్ అబ్దుల్ అజీజ్, గౌస్ బాషా, షావలి తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో భద్రత తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కర్మాగారాల్లో భద్రతకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలో కర్మాగారాల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఫ్యాక్టరీస్ శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ మీటింగ్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఉన్న కర్మాగారాల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు కచ్చితంగా భద్రతా చర్యలు తీసుకోవాలని కర్మాగారాల యాజమాన్యాల ప్రతినిధులను ఆదేశించారు. హెచ్‌పిసిఎల్ పైప్ లైన్‌ను డ్రోన్‌లతో పర్యవేక్షించే అంశంపై పరిశీలించాలని ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్‌కు సూచించారు. కర్మాగారాల్లో మాక్ డ్రిల్‌లు తరచూ నిర్వహించాలని ఆదేశించారు. ఫైర్, పోలీస్, రెవెన్యూ, వైద్య తదితర అత్యవసర విభాగాలు కూడా ఈ మాక్ డ్రిల్ లో పాల్గొనాలని ఆదేశించారు. ప్రమాదకరమైన కర్మాగారాల్లో సబ్ కమిటీలు ఇచ్చిన నివేదికల మేరకు భద్రతా చర్యలను మరోసారి చెక్ చేయాలని డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్‌ను ఆదేశించారు. డిస్ట్రిక్ట్ క్రైసిస్ గ్రూప్ సభ్యులు కూడా టీమ్‌గా వెళ్ళి కర్మాగారాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్ స్పెక్టర్ నారాయణ రెడ్డి జిల్లాలో ఉన్న కర్మాగారాల పరిస్థితి గురించి వివరించారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి అవినాష్ జయసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

సౌండ్ ప్రూఫ్ బేరా పరీక్ష గది ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఈఎన్‌టి ఒపి విభాగంలో సౌండ్ ప్రూఫ్ బేరా పరీక్ష గదిని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వాస్పత్రి ఈఎన్‌టి ఒపి విభాగంలో వినికిడి లోపాన్ని గుర్తించే పరికరాలను సౌండ్ ప్రూఫ్ బేరా పరీక్ష గదికి అన్ని మరమ్మతులు పూర్తిచేసి ప్రారంభించామని తెలిపారు. బేరా పరీక్ష ద్వారా రోగులకు వినికిడి లోపాన్ని గుర్తించి, సమస్య తీవ్రత ఆధారంగా సర్జరీలు నిర్వహిస్తారని చెప్పారు. ఆస్పత్రిలో బేరా టెస్ట్ ద్వారా సదరం కేసులు, వినికిడి లోపం, శ్రవణ నాడి రుగ్మతలు, వినికిడిని ప్రభావితం చేసే ఇతర నాడీ సంబంధిత పరిస్థితులను నిర్ధారించడంలో సహాయపడుతుందన్నారు. సదరం సర్టిఫికెట్లు వంటి వైకల్య ధ్రువపత్రాల కచ్చితత్వం సమగ్రతను నిర్ధారించడంలో బేరా ఒక విలువైన పరీక్షా అని అన్నారు. సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఈఎన్‌టి హెచ్‌ఒడి డాక్టర్ వీర కుమార్, అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల, నగాంజన్ పాల్గొన్నారు.

పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

విద్యార్థులు గ్రంథాలయాలకొచ్చి పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తెలిపారు. బుధవారం వేసవి ఓరియంటేషన్ ప్రోగ్రాం, వేసవి విజ్ఞాన తరగతులు ఘనంగా జరిగాయి. ముందుగా విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించారు. ఎం.నాగరాజు, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చరిత్ర, జనరల్ నాలెడ్జికి సంబంధించిన విషయాలను విద్యార్థులకు వివరించారు. జి.వెంకటేశ్వర్లు యోగా , అనంతరం హాసిని మెడిటేషన్ తరగతులను చెప్పారు. అనంతరం హరికిషన్, బసవరాజు విద్యార్థులకు కథలు, పాటలు నేర్పించారు.

స్మార్ట్ మీటర్లు వద్దు...

- సిపిఎం నగర కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

స్మార్ట్ మీటర్లు వద్దని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు కోరారు. బుధవారం కర్నూలు కార్పొరేషన్ ఇందిరా గాంధీ నగర్ సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో ప్రజలను చైతన్యం చేశారు. 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, నగర నాయకులు కె.అరుణ, ఎం.భాస్కర్, ఎ.శ్రీని వాసులు, యు.విజయ్ కుమార్, ఎస్.హుస్సే న్ బాష, ఎస్.జమాల్, పిఎస్.సుజాత, సావిత్రమ్మ, జమున, పర్వీన్ ఇంటింటికీ వెళ్లి 'మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి' అని రాసి ఉన్న స్టిక్కర్లను అతికించారు. ఈ సందర్భంగా రాముడు మాట్లాడారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమ ని.. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు నాయకులు హామీ ఇచ్చారని తెలిపారు. చెప్పిన మాటలను తుంగలో తొక్కి ప్రజలపై విద్యుత్ చార్జీల భారం వేస్తున్నారని విమర్శించారు. చార్జీల పేరుతో దాదాపు రూ.20 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు. ఇప్పుడు కమర్షియల్ షాపులన్నింటికీ స్మార్ట్ మీటర్లు బిగించారని, షాపులో యజమానులను విచారిస్తే గతంలో వస్తున్న విద్యుత్ బిల్లు కంటే రెండింతలు, మూడింతలు ఎక్కువగా వస్తోందని బిల్లులు చూపిస్తున్నారని అన్నారు. ఇప్పుడు ఇంటింటికీ స్మార్ట్ మీటర్ పెట్టడానికి రంగం సిద్ధం చేసిన ప్రభుత్వం ప్రజలపై మరింతగా భారం వేసేందుకు సిద్ధమయిందని మండిపడ్డారు. ప్రజాగ్రహానికి గురికాక ముందే కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తగిన బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

స్టిక్కర్లను అతికిస్తున్న నాయకులు

చెరుకులపాడులో నారాయణరెడ్డి వర్ధంతి

ప్రజాశక్తి - వెల్దుర్తి

చెరుకులపాడు నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, వైసిపి కార్యకర్తలు ఘన నివాళి అర్పించారు. చెరుకులపాడు గ్రామంలోని ఆయన సమాధి వద్ద చెరుకులపాడు నారాయణ రెడ్డి సతీమణి పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ వైఎస్ఆర్ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్ రెడ్డి, క్రిష్ణగిరి ఎంపీపీ వెంకటరామిరెడ్డి, తదితరులు పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చెరుకులపాడు నారాయణరెడ్డి ప్రజలకు చేసిన సేవలను స్మరించుకున్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించి, మౌలిక వసతులు కల్పించేందుకు చెరుకులపాడు నారాయణరెడ్డి మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారని గుర్తు చేసుకున్నారు. ప్రజలతో మమేకపోవడంలో తనకు సాటిలేరు మరెవరిని నిరూపించుకున్న మంచి మనిషి తన భర్త నారాయణరెడ్డి అని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఈ సందర్భంగా అన్నారు. ప్రజలలో ఆయనపై ఉన్న అభిమానమే తనను 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచేలా చేసిందని గుర్తు చేశారు. తన భర్త హత్య కేసులో నిందితులకు న్యాయస్థానం తగిన శిక్ష వేసిందని చెప్పారు.ఈ తీర్పును చూసుకొని ఎటువంటి పరిస్థితుల్లో ప్యాక్షన్ జోలికి వెళ్లకుండా ఉండాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ సూచించారు. అనంతరం కర్నూల్‌లో వృద్ధాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

నివాళులర్పిస్తున్న శ్రీదేవి, కుటుంబ సభ్యులు



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

స్థానిక ఎన్నికల్లో విజయం సాధించాలి

- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించేలా ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని జిల్లా టిడిపి అధ్యక్షులు పి.తిక్కారెడ్డి అన్నారు. బుధవారం వెల్దుర్తి టిడిపికార్యాలయంలో మినీ మహానాడు కార్యక్రమం టిడిపి సీనియర్ నాయకులు సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేఈ శ్యాం బాబు, మాజీ మంత్రి కేఈ ప్రభాకర్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ముందుగా ఎన్టీఆర్ స్మారక విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన వీర జవాన్ మురళి నాయక్‌కు, నియోజకవర్గంలోని ఇటీవల మృతి చెందిన టిడిపి కార్యకర్తలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. టిడిపి బీసీ, బడుగు బలహీన వర్గాల పార్టీ అని, కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని తెలిపారు. గత సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు కోసమై కష్టపడి పనిచేసినట్లుగానే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐకమత్యంతో గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు సమన్వయంతో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కడపలో జరగబోవు మహానాడు కార్యక్రమానికి జిల్లా నుండి కార్యకర్తలు నాయకులు భారీగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మాజీ ఎంపిపి జ్ఞానేశ్వర్ గౌడ్, టిడిపి మండల అధ్యక్షులు బలరాం గౌడ్, టిడిపి నాయకులు రమాకాంత్ రెడ్డి, బోయినపల్లి కాంతారెడ్డి, సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు.

పది ఫలితాల్లో 'సంసిధ్' వందశాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యా రంగంలో సాంకేతికతను వినియోగిస్తూ టాటా క్లాస్ ఎడ్జ్ లిమిటెడ్, సంసిధ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మధ్య ఏర్పడిన భాగస్వామ్యంతో 2024-25 విద్యా సంవత్సరానికి కర్నూలు సంసిధ్ స్కూల్ పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. బుధవారం పాఠశాల ప్రిన్సిపల్ సుజాత మాట్లాడారు. ఈ ఫలితాలు తమ పాఠశాలలో ప్రవేశ పెట్టిన సాంకేతికత ఆధారిత బోధన, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల మద్దతుతో సాధ్యమయ్యాయని తెలిపారు. వందశాతం ఉత్తీర్ణత తమ స్కూల్ ప్రగతికి నిదర్శనమన్నారు.

టాప్ స్కోర్ సాధించిన విద్యార్థులు

గడి సాయి చరిత 94 శాతం, కె.ధీరజ్ 91.3, వాల్మీకి వైష్ణవి 91.1, ఎడిగోతి ప్రణతి 89, షేక్ హిబా కౌసర్ 88 శాతం సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు టాటా క్లాస్ ఎడ్జ్, సంసిధ్ భాగస్వామ్యం జిల్లాలో విద్యా రంగానికి మార్గనిర్దేశకంగా మారుతుందని చెప్పారు.

దేశం గర్వపడేలా క్రీడాకారులు తయారవుతారు

- సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ - సబ్ జూనియర్ వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

కర్నూలు నుండి భవిష్యత్తులో దేశం గర్వపడేలా క్రీడాకారులు తయారవుతారని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ ఆకాంక్షించారు. నగరంలోని బి క్యాంపు లో ఉన్న సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సబ్ జూనియర్ అండర్ 14 వాలీబాల్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డీఎస్ఏ వాలీబాల్ కోచ్ రవి, వ్యాయామ ఉపాధ్యాయుడు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ నగరంలో లేని విధంగా కర్నూల్ నగరంలో క్రీడా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇది మరింత ప్రచారం అయితే కర్నూల్లో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో కర్నూల్ నగరం నుంచి దేశం గర్వపడే స్థాయిలో భవిష్యత్తులో క్రీడాకారులు తయారవుతారని ఆయన తెలిపారు. ఈ స్థాయిలో క్రీడా కార్యక్రమాలు నగరంలో జరగడం గర్వకారణమని ఆయన వివరించారు. ప్రస్తుతం జరిగిన ఈ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. కర్నూల్ నగరంలో క్రీడల అభివృద్ధికి సంబంధించి దాతలు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని ఆయన చెప్పారు. ఏ రంగంలో లేని విధంగా కుల మతాలకు అతీతంగా కలిసికట్టుగా ముందుకు సాగే ఏకైక రంగం క్రీడారంగం మాత్రమేనని ఆయన అన్నారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల గెలుపు ఓటములను సమానంగా తీసుకుంటారని, ఫలితంగా చిన్నచిన్న వైఫల్యాలకు ఆత్మహత్య లాంటి విపరీత నిర్ణయాలు తీసుకోకుండా క్రీడాకారులు ధైర్యంగా ఉంటారని తెలిపారు. కర్నూల్ నగరంలో క్రీడలను ప్రోత్సహించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.

బహుమతులు అందజేస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి

అందుబాటులోకి అత్యవసవ వైద్య సేవలు

- క్రిటికల్ యూనిట్ ఏర్పాటు చేస్తాం - ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

- 100 పడకల ఏరియా ఆస్పత్రి ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అత్యవసవ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ప్రస్తుతం ఉన్న 50 పడకల సిహెచ్‌సి ఆస్పత్రిని రూ.12.60 కోట్లు నాబార్డు నిధులతో 100 పడకల ఏరియా ఆస్పత్రిగా ఆధునీకరణ చేశారు. ఈ నూతన భవన సముదాయాన్ని బుధవారం ఎమ్మెల్యే బీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరులో 100 పడకల ఆస్పత్రి ప్రారంభం కావడం వల్ల అత్యవస వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఇక్కడ గుండె సంబంధిత సేవలు లేకపోవడంతో తాను డాక్టర్‌గా ఉన్నప్పటికీ తన తల్లి ప్రాణాలు కాపాడుకోలేకపోయానని, త్వరలోనే క్రిటికల్ యూనిట్ ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. అప్పుడే అవసరమైన కార్డియాల్జిస్ట్, జనరల్ ఫిజిషియన్, జనరల్ సర్జన్ వైద్యులు వస్తారని తెలిపారు. అన్ని సౌకర్యాలూ వస్తాయని, తన తల్లిలాగా ఏ అమ్మ ప్రాణాలు పోరాదని, ఇందుకోసం నిరంతరం ఆస్పత్రిపై పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, టిడిపి నాయకులు భాస్కర్ల చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కురువ మల్లయ్య, రామదాసు గౌడ్, కొండయ్య చౌదరి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, రామకృష్ణ నాయుడు, అంబేద్కర్, సురేష్ చౌదరి, డిసిహెచ్‌ఎం డాక్టర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ సత్యవతి, డాక్టర్ బాలాజీ కుమార్, డాక్టర్ చిరంజీవి, మల్లికార్జున, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సుజాత, డాక్టర్ హవి ప్రియాంక, డాక్టర్ భార్గవి, డాక్టర్ మహబూబ్, డాక్టర్ సమీరా, డాక్టర్ కుమార్ నాయుడు, ఆస్పత్రి ఉద్యోగులు దొరబాబు, వంశీ, పురుషోత్తం, విష్ణు, బిజెపి జిల్లా కార్యదర్శి తోగట నరసింహులు, జనసేన పార్టీ నాయకులు సప్పోగు భాస్కర్, టిడిపి నాయకులు బందే నవాజ్, బడేసాబ్, గట్టు అల్తాఫ్, మహేష్, కటారి రాజేంద్ర, శివశంకర్, రంగస్వామి గౌడ్, మురళీ కృష్ణారెడ్డి, దామ నరసింహులు, వడ్డే కృష్ణ, అంజి, దాదావలీ, అన్నపూర్ణమ్మ, పార్వతి, ఇసాక్, అమాన్, వహీద్ పాల్గొన్నారు.

'ఓరియంటేషన్'ను వినియోగించుకోండి

- గ్రంథాలయ అధికారి మధులీల

ప్రజాశక్తి - కౌతాళం

గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ అధికారి మధు లీల కోరారు. బుధవారం గ్రంథాలయంలో విద్యార్థులతో 'ఆటలు ఆడుదాం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు పుస్తకాలు చదవడం, చిత్రలేఖనం, పాటలు పాడడం వంటి కార్యక్రమాలు నిర్వహించి చదువుపై విద్యార్థుల్లో ఆసక్తి పెంచుతున్నామని ఆమె తెలిపారు. సృజనాత్మక పద్ధతులను అనుసరించి విద్యార్థుల దృష్టి పాఠశాలలో ఉండేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం గ్రంథాలయాల ఆధ్వర్యంలో మంచి కార్యక్రమాలు నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఆటలు ఆడుతున్న చిన్నారులు

అభివృద్ధికి మరింత కృషి చేయాలి

- పదోన్నతి పొందిన కమిషనర్‌కు సన్మానం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని అభివృద్ధికి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మరింత కృషి చేయాలని బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ గ్రేడ్-1 కమిషనర్‌గా పదోన్నతి పొందడం హర్షనీయమన్నారు. బదిలీపై వెళ్లకుండా ఇక్కడే సేవలందిస్తూ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. డివిజన్ ఉపాధ్యక్షులు దేవిశెట్టి ప్రకాష్, ధణాపురం శేషన్న, కత్తి హనుమంతరావు, విశ్రాంత తహశీల్దార్ షేక్షావలీ, గౌరవ సలహాదారులు వీరభద్ర, పట్టణ ఉపాధ్యక్షులు ఎం.రామకృష్ణ, గడిగ రామదాస్, జనరల్ సెక్రటరీ బోయ మల్లేశ్వరప్ప పాల్గొన్నారు.

కమిషనర్‌ను సన్మానిస్తున్న బీసీ నాయకులు

'కూటమి'లో సఖ్యత కరువు

- నాయకుల మధ్య పెరుగుతున్న దూరం

- కుంటుపడుతున్న అభివృద్ధి

- నియోజకవర్గ ప్రజల మండిపాటు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సఖ్యత కరువైంది. నాయకుల మధ్య దూరం పెరుగుతూనే ఉంది. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టకపోవడంతో ఇదేమి పాలన అంటూ ఆదోని ప్రజలు మండిపడుతున్నారు...

ఈనెల 19న ఆదోనిలోనే జెబి గార్డెన్స్‌లో నియోజకవర్గ ఇన్‌ఛార్జీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో టిడిపి మినీ మహానాడు నిర్వహించారు. ఎంపీ నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కారెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి హాజరయ్యారు. మహానాడుకు ముందు నియోజకవర్గాల వారీగా మినీ మహానాడు జరపడం టిడిపిలో వస్తున్న ఆనవాయితీ అని టిడిపి నాయకులు చెబుతున్నారు. అలాంటి కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి గ్రూపు గైర్హాజరయింది. మినీ మహానాడులో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, మీనాక్షి నాయుడు తనయుడు భూపాల్ చౌదరి ఆవేశపూరితంగా మాట్లాడారు. 'మీనాక్షి నాయుడు చాటున ఎదిగి నాయకులై ఆయనకే ఎదురు తిరుగుతారా' అంటూ ప్రసంగంలో పేర్కొన్నారు. చంద్రబాబు పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమానికి హాజరు కాకపోవడమేమిటని నిలదీశారు. మినీ మహానాడు నిర్వహణ గురించి తమకు సమాచారం లేదని, అలాంటిది ఎలా హాజరయ్యేదని గైర్హాజరయిన వారు చెబుతున్నారు. తమ సమస్యలు ఏవైనా ఉన్నా అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, అక్కడే చెప్పుకుంటామని, అంతే తప్ప స్థానిక నాయకులకు చెప్పాల్సిన అవసరం లేదని వారు స్పష్టం చేస్తున్నారు.

సఖ్యత కరువు

ఆదోని నియోజకవర్గంలో కూటమి నాయకుల మధ్య సఖ్యత కరువైందని చర్చ నడుస్తోంది. ఎమ్మెల్యేగా పార్థసారథి బాధ్యతలు చేపట్టిన మొదట్లో జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప చురుకుగా ఉండేవారు. ప్రస్తుతం ఆయన కూడా దూరంగా ఉంటున్నట్లు తెలిసింది. ఇటీవల తాగునీటి పథకాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన విషయంపై ఎమ్మెల్యే పార్థసారథి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ సమావేశానికి జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప లేకపోవడం చర్చకు దారితీసింది. మధ్యాహ్న భోజనం నిర్వహణ, ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు తదితర పోస్టుల్లో తమకు అనుకూలమైన వారిని నియమించుకునేందుకు ఎవరికి వారే పావులు కదుపుతున్నారు. పార్టీల వారీగా డీలర్ షిప్‌లు పంచుకోవాలని ఇటీవల డిమాండ్ వచ్చింది. ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షినాయుడు మధ్య అవగాహన కుదిరినట్లు ఆ పార్టీ నాయకులు చెప్పారు. పంపకాల కేటాయింపుల్లో జనసేన వాటా ఎంత అన్నది ఇంతవరకు స్పష్టత లేదు. ఇరుకు రోడ్ల వెడల్పు, మాస్టర్ ప్లాన్ అమలు, మైనార్టీ ఐటిఐ కళాశాల, మైనార్టీ రెసిడెన్స్ స్కూల్ పూర్తయినా ఇంతవరకు ఫ్యాకల్టీని నియమించకపోవడం ప్రారంభానికి నోచుకోని పరిస్థితి ఉంది. డిగ్రీ కళాశాల ప్రారంభమైనా సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్ ఉంది. ఇంతవరకు ముందుకు సాగని పరిస్థితి ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఇంతవరకు కొత్త పథకాలు, కొత్త పనులు జరగకపోవడం, మంజూరుకు నాయకులు ప్రత్యేక కృషి చేయకపోవడంతో ఆదోనిలో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని పలువురు పేర్కొంటున్నారు. పంతాలు మాని ప్రణాళిక బద్ధంగా ఆదోని అభివృద్ధికి బాటలు వేసేలా కూటమి నాయకులు పాటు పడాలని కోరుతున్నారు.



సమయం పాలన పాటించని సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలో ఉన్న సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. బుధవారం స్థానిక నాలుగో సచివాలయంలో 11.30 గంటలైనా ఉద్యోగులు రాకపోవడంతో ప్రజలు అసహనానికి గురయ్యారు. కోసిగిలో ఐదు సచివాలయాలు ఉన్నప్పటికీ ఏ ఒక్క సచివాలయంలో కూడా పూర్తిస్థాయిలో ఉద్యోగులు లేకపోవడంతో అధికారులు చేసేదేమీ లేక తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన రేషన్ కార్డుల కోసం సచివాలయాలకు ప్రజలు క్యూ కడుతున్నారు. దీనికి తోడు ఉద్యోగులు కూడా సమయపాలన పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, ఏమీ పట్టనట్లు విధులు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటల నుంచి సచివాలయాలకు వెళ్లి కూర్చుంటున్నారు. సచివాలయాల్లో సిబ్బంది లేకపోవడంతో ఎంపిడిఒకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సచివాలయానికి వచ్చి ఎంపిడిఒ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. తనిఖీ చేసే సమయంలో అధికారులు లేకపోవడంతో ఉద్యోగులపై మండిపడ్డారు. ప్రతి ఉద్యోగి సమయ పాలన పాటించి సచివాలయాల్లో సేవలు అందించాలని, లేకపోతే జిల్లా అధికారులకు తెలియజేసి వారిపై షోకాజు నోటీసులు అందజేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

వాల్మీకి కమ్యూనిటీ భవన్‌ను పూర్తి చేస్తాం

- ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో పోస్టాఫీసు ఎదురుగా వాల్మీకి కమ్యూనిటీ భవన్‌ను పూర్తి చేసి తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డి కలను నెరవేర్చుతానని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. వాల్మీకి కమ్యూనిటీ భవన్‌కు ఈనెల 20న ఎమ్మిగనూరులో జరిగిన మినీ మహానాడులో బీవీ.జయనాగేశ్వర రెడ్డి రూ.50 లక్షలు, ఎంపీ బస్తిపాటి నాగరాజు నిధులు ఇస్తామని ప్రకటించారు. బుధవారం వాల్మీకి కమ్యూనిటీ సంక్షేమ భవన్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు ఎఇ మల్లయ్య, బిజిఆర్.కొండయ్య, రామకృష్ణ, బిఎల్.నారాయణ, టీ స్టాల్ చంద్రన్న, పుండుకూర రంగన్న, సొగనూరు జగదీష్, బోయ రాఘవేంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీని సన్మానించారు. ఈ సందర్భంగా బీవీ మాట్లాడారు. తన తండ్రి బీవీ.మోహన్ రెడ్డి వాల్మీకులకు కేటాయించిన స్థలం మీదని, త్వరలోనే రూ.75 లక్షలు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. తాలూకా స్థాయిలో వాల్మీకి పెద్దలతో ఓ కమిటీ వేసి జిల్లాలో ఎక్కడా లేనివిధంగా కమ్యూనిటీ భవన్‌ను నిర్మిస్తామని చెప్పారు. ఇందుకోసం కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తామని అన్నారు. అనంతరం వాల్మీకి కమ్యూనిటీ భవన్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... వాల్మీకి సమాజం బీవీ కుటుంబం వెంట ఉంటుందని పేర్కొన్నారు. బచ్చాల రంగన్న, గోనెగండ్ల రంగముని, లింగమూర్తి, ఎన్‌వి.రామాంజనేయులు, బోయ రాఘవేంద్ర, మునిస్వామి, మధుబాబు నాయుడు, రాజకుమార్ నాయుడు, కోటేకల్ అంజి, యల్లంబీడు లక్ష్మన్న, హమాలీ ఉరుకుందు, లక్ష్మన్న, రంగస్వామి, యాపిలయ్య, ఎర్రబాడు శ్రీనివాసులు, నాగేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న వాల్మీకి సంఘ నాయకులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన హరిజన హనుమంతప్ప కుటుంబానికి వైసిపి నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. హరిజన హనుమంతప్ప మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాంపురం రెడ్డి సోదరులు హనుమంతప్ప కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సహాయం కింద రూ.10 వేలు ఇవ్వాలని మాజీ వైస్ ఎంపిపి వెంకోబ, వైసిపి నాయకులు మజ్జిగ రోగప్ప, బొజ్జప్ప, నారాయణను ఆదేశించారు. వారి సూచన మేరకు బుధవారం హనుమంతప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10 వేల నగదు అందజేశారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వడ్డే బాలరాజు కుటుంబానికి ఎప్పుడూ అండగా ఉంటామని వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో వడ్డే బాలరాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన వడ్డే బాలరాజు ఇంటికి చేరుకొని మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమారెడ్డి, మండల ఇన్‌ఛార్జీ సివి.విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వడ్డే నారాయణ, జనార్ధన్ రెడ్డి, గంగపుత్ర సంఘం అధ్యక్షులు శాంతయ్య ఉన్నారు.

పరామర్శించి బయటకొస్తున్న సీతారామిరెడ్డి

కదం తొక్కిన 'మున్సిపల్' కార్మికులు

- సమాన పనికి సమాన వేతనమివ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - ఆదోని

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ కదం తొక్కారు. బుధవారం ప్రధాన రోడ్డు గుండా ప్రదర్శన నిర్వహించి, మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సోమన్న, పీరా సాహెబ్, అహ్మద్ మాట్లాడారు. మున్సిపాలిటీలోని ఇంజినీరింగ్ విభాగం, తాగునీటి సరఫరా విభాగాల్లో దశాబ్ద కాలంగా కనీస వేతనానికి నోచుకోకుండానే కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. కనీస వేతనం టెక్నికల్ రూ.29,500, నాన్ టెక్నికల్‌కు రూ.24,500లకు పెంచాలని కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. 15 ఏళ్ల సర్వీస్ నిండిన వారిని రెగ్యులర్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. దాదాపు అన్ని మున్సిపాలిటీల్లోనూ ఇంజినీర్ కార్మికులు సమ్మెలోకి వెళ్లినట్లు తెలిపారు. కేవలము కమిటీలను వేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా వీధిలైట్లు, నీటి పంపింగ్‌ను బంద్ చేయడానికి కూడా వెనకడబోమని హెచ్చరించారు. ఇప్పటికే సిడిఎంఎ వారికి రెండు దఫాలుగా వినతిపత్రం ఇచ్చామని తెలిపారు. మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు కర్రెప్ప, శివరాం, మారెప్ప, కృష్ణమూర్తి, వలీ, ఎపి.చంద్ర, కైలాస్, వీరేష్, శ్రీనివాసులు, మహేష్, బాష ఉన్నారు.

నిరసన చేపడుతున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

రాజీవ్ గాంధీ ఆశయాలు కొనసాగిద్దాం

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ

ప్రజాశక్తి :ఎమ్మిగనూరు

మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్ గాంధీ ఆశయాలను కొనసాగిద్దామని కాంగ్రెస్ పార్టీ తాలూకా ఇన్‌ఛార్జీ ఖాసీం వలీ కోరారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ వర్ధంతి నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజీవ్ గాంధీ హయాంలోనే కంప్యూటర్ టెక్నాలజీని అందుబాటులోకి వచ్చిందని, టెక్నీషియన్లను ప్రవేశపెట్టి ఎస్‌టిడి ఇంటర్నెట్ సేవలను వినియోగంలోకి తెచ్చారని తెలిపారు. పంచాయతీలకు కేంద్రం నేరుగా నిధులు ఇచ్చే అవకాశం కల్పించారని, 18 ఏళ్లు దాటిన వారికి ఓటు హక్కు కల్పించి దేశ ఆర్థిక అభివృద్ధిని ముందుకు నడిపించారని చెప్పారు. దేశంలో కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, అందరికీ న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగలదిన్నె షబ్బీర్, ఆసిఫ్, నరసప్ప, రఫీక్, శంకరన్న, వీరేంద్ర, ఉరుకుందు, హర్ష, నియామత్, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతి

రేషన్ వాహనాల రద్దుపై డీలర్ల హర్షం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రేషన్ (ఎండియు) వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడం పట్ల ఎమ్మిగనూరు రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని డీలర్ల సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎమ్మిగనూరు రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా మాట్లాడారు. డీలర్ల వ్యవస్థపై ముఖ్యమంత్రి చంద్రబాబు నమ్మకం ఉంచారని తెలిపారు. జూన్ 1 నుంచి రేషన్ దుకాణాల వద్దే బియ్యం పంపిణీ ఉంటుందని చెప్పారు.

నాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

సంధికి విఫలయత్నం..!

- ససేమిరా అన్న తిక్కారెడ్డి గ్రూపు - ప్రతి పనికీ ఒక పెట్టారని ఫిర్యాదులు

- పరిశీలిస్తామన్న ధర్మవరం సుబ్బారెడ్డి

- మినీ మహానాడుకు తిక్కారెడ్డి గ్రూపు దూరం

ప్రజాశక్తి - మంత్రాలయం

నియోజకవర్గంలోని తెలుగు తమ్ముళ్లలో నెలకొన్న విభేదాలను తొలగించేందుకు నియోజకవర్గ పరిశీలకులు ధర్మవరం సుబ్బారెడ్డి చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మంగళవారం మినీ మహానాడును ఇటు టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి గ్రూపు పార్టీ కార్యాలయంలో చేయాలని, అటు టిటిడి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి గ్రూపు రివరిన్ ఫంక్షన్ హాలులో నిర్వహించాలని భావించారు. ముందుగా నియోజకవర్గ పరిశీలకులు ధర్మవరం సుబ్బారెడ్డి, ఎంపీ బస్తిపాటి నాగరాజులు పార్టీ కార్యాలయంలో తిక్కారెడ్డి గ్రూపుతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు ఏడాది పాలన సందర్భంగా రెండు గ్రూపుల వారు కలిసి పోవాలని, అందరూ కలిసి కట్టుగా ఒకేచోట మినీ మహానాడు నిర్వహించి విజయవంతం చేసుకుని మహానాడుకు సిద్ధమవుదామని కోరారు. వారి మాటలకు స్పందించిన తిక్కారెడ్డి గ్రూపు... రాఘవేంద్ర రెడ్డి గ్రూపు దాడులకు పాల్పడుతోందని, ఏ విధంగా వారితో కలవాలని ప్రశ్నించారు. పైగా ప్రతి గ్రామంలోనూ ఆయన గ్రూపు కలిసి రావడం లేదని వాపోయారు. నియోజకవర్గంలో ప్రతి పనికీ ఒక ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని, ప్రతి పల్లెలో తమ గ్రూపు వారి వద్ద కూడా ప్రతి బెల్టు షాపునకు రూ.30 వేలు వసూలు చేశారని, అలా ప్రతి గ్రామంలో 6 బెల్టు షాపులు వారే నడుపుతున్నారని, ఉపాధిలో కూడా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.లక్షల్లో వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. మీరు చెప్పిన ప్రతి విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు తెలిపారు. రాఘవేంద్రరెడ్డి గ్రూపుతో కలవడానికి ససేమిరా అనడంతో చివరికి తిక్కారెడ్డి మాత్రమే రాఘవేంద్ర రెడ్డి గ్రూపు ఏర్పాటు చేసిన మినీ మహానాడుకు జిల్లా అధ్యక్షుల హోదాలో హాజరయ్యారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి, మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, మీడియా కోఆర్డినేటర్ విజయరామిరెడ్డి, బీసీ సెల్ అధ్యక్షులు అమర్‌నాథరెడ్డి, జనరల్ సెక్రటరీ వట్టెప్ప గారి నరసింహ, హండే అను మంతు, వనికె నాగరాజు, గణేకంటి రఘు, గణేకంటి రామకృష్ణ, మద్రి ఏబుతో గ్రామాల నుంచి వచ్చిన తిక్కారెడ్డి గ్రూపు పార్టీ కార్యాలయం వద్దే వేచి చూసి వెనుదిరిగారు.

'ఎయిడ్స్‌పై అవగాహన అవసరం'

ప్రజాశక్తి -ఆలూరు

ప్రజలు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఆర్డిప్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు తెలిపారు. బుధవారం సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు పాతబస్టాండ్‌లో జానపద కళాజాత నిర్వహించారు. ఆర్డిప్ ప్రాజెక్ట్ మేనేజర్ మాలిక్, మంజుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సభ్యులు

యోగాంధ్రలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయండి

- సచివాలయ సిబ్బందితో కమిషనర్ యస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంపై ప్రజల్లో చైతన్యం కలిగించి మాసోత్సవ కార్యక్రమాల్లో భాగస్వామ్యం అయ్యేలా చూడాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ మందిరంలో అడ్మిన్, అమినిటీస్, ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ... ఈనెల 21 నుంచి జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతపై ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యం కలిగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యోగాంధ్ర యాప్‌లో సుముఖంగా ఉన్న వారి వివరాలను నమోదు చేయాల ని, వచ్చే నెల 21న కర్నూలులో జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ప్రజలు తరలి వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాసోత్సవ కార్యాచరణను వివరించారు.

ఆస్తి పన్ను మదింపు పక్కాగా చేపట్టండి : కొంతమంది యజమానులు అధునాతన భవనాలు కట్టినా పాత ఇంటి బిల్లులు ఇంకా జనరేట్ అవుతునందున, వాటిని పునః పరిశీలన ద్వారా సరి చేయాలని కమిషనర్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టి, ఏమాత్రం తగ్గినట్లు అనుమానం ఉన్నా తక్షణమే వాటికి పన్నులు విధించాలని ఆదేశించారు. నగరంలో పునః పరిశీలన ద్వారా రూ.15.54 కోట్ల అదనపు పన్ను ఆదాయం రావాల్సి ఉందన్నారు. ట్యాబ్ కనెక్షన్‌లను సైతం పరిశీలించాలని, ఏవైనా కారణాలతో కొళాయి చార్జీలు విధించకపోయి ఉంటే చార్జీలు వేయాలని పేర్కొన్నారు. వచ్చే నెల 15 వరకు ఈ సర్వే పూర్తి చేయాలని, ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించిన కఠిన చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్ వాజిద్, ఆర్ఐలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

ఓటు నమోదు చేసుకోవాలి : జెసి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

18 సంవత్సరములు నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా చూడాలని పాణ్యం పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ ప్రతినిధి మంజునాథ్, బీఎస్పీ పార్టీ ప్రతినిధి రామశేషయ్య, బిజెపి పార్టీ ప్రతినిధి నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామకృష్ణ, ఐఎన్‌సి పార్టీ ప్రతినిధి ఎస్ రజాక్ వల్లిలు పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ 18సంవత్సరములు నిండిన యువత ను మరియు ట్రాన్స్ జెండర్స్ ను గుర్తించి ఫామ్ 6 ద్వారా ఓటు నమోదు చేసుకునేలా చూడాలని పాణ్యం నియోజకవర్గ పొలిటికల్ పార్టీ ప్రతినిధులకు జాయింట్ కలెక్టర్ సూచించారు. ఇప్పటివరకు పాణ్యం నియోజకవర్గంలో 1177 డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం జరిగిందన్నారు. దాదాపు 500 నూతన ఓటర్లను నమోదు చేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలో 1200 ఓట్లు దాటి ఉన్నటువంటి పోలింగ్ స్టేషన్లను గుర్తించి, అదనముగా ఉన్న ఓటర్లను ఫార్మ్ 8 ద్వారా ఇతర పోలింగ్ స్టేషనులకు బదిలీ చేయడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని తెలియజేశారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్, జనవరి, మాసాలలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. వివాహం చేసుకొని వెళ్లిన మహిళలు, ఉద్యోగరీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, వలసలు వెళ్లినవారు తమ ఓటును బదిలీ చేసుకోవచ్చన్నారు.

'పథకాల అమలుపై సమీక్షలు'

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి వారం మండలాలకు వెళ్లి ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మండల స్పెషల్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల స్పెషల్ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, హౌసింగ్, పాజిటివ్ పర్సెప్షన్,జిఎస్డబ్ల్యూఎస్ సర్వీసులు, తదితర అంశాలపై తప్పనిసరిగా సమీక్ష చేయాలన్నారు. ఎక్కడైనా నిర్దిష్ట సమస్య ఏమైనా ఉంటే వాటిని సంబంధిత అధికారుల దష్టికి తీసుకువెళ్లి, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల స్పెషల్ అధికారులను ఆదేశించారు. ఏమైనా ఇంకా పెద్ద సమస్యలు ఉంటే తన దృష్టికి కూడా తీసుకొని రావాలన్నారు. ప్రతి నెలా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి హాజరు కావాలని ఆదేశించా రు. వేదవతి నదికి వరద వచ్చిన పరిస్థితుల్లో సంబంధిత మండలాల స్పెషల్ అధికారులు విజిట్ చేసి రెవెన్యూ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి, కర్నూల్ మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, మండల స్పెషల్ అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ ఆర్డీఓ భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

-ఎంఎస్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ హమీద్

ప్రజాశక్తి - పత్తికొండ

నిరుద్యోగులు, విద్యార్థులు పట్టదలతో బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకున్నప్పుడే మంచి గుర్తింపు ఉంటుందని హైదరాబాద్ ఎంఎస్ ఎడ్యుకేషనల్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ హమీద్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యువ స్పందన సొసైటీ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల్లో ఇంగ్లీషు సబ్జెక్‌పై మెళుకువలు, పరీక్ష సన్నద్ధతకు మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సయ్యద్ హమీద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నిరుద్యోగులు, విద్యార్థులు తెలుగు భాషతో పాటు ఇంగ్లీష్ భాషపై కూడా పట్టు సాధించాలని, అప్పుడే పోటీ పరీక్షల్లో రాణించగలరని తెలిపారు. ఇంగ్లీష్‌పై సందేహాలను డాక్టర్ సయ్యద్ హమీద్ నివృత్తి చేశారు. అనంతరం సయ్యద్ హమీద్, రిటైర్డ్ బిఎస్ఎన్ఎల్ అధికారి సింగర్ శివయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు వీరేశప్పలను యువ స్పందన సొసైటీ సభ్యులు సన్మానించారు. యువ స్పందన సొసైటీ ఉపాధ్యక్షులు లక్ష్మన్న, జాయింట్ సెక్రటరీ గిరీష్, సభ్యులు రాజేశ్వరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న సభ్యులు